# స్నేహమేరా జీవితం!

పులిచెర్ల సుబ్బారావు

చివ్వున తారాజువ్వలా లేచాడు వెంకటేశ్వర్లు. కంచం వాల్చి, మెతుకులు రాల్చి, కొరివికారం కసిదీరా కలిపాడు.

రాత్రి మళ్ళీ వచ్చేసరికి ఎంత లైవౌతుందో, ఏమో? అదీగాక, ఇందాకనే వాళ్ళమ్మ ఖూర్లో దాచిన ఐదు రూపాయల నిధి అతని కైవసమైంది.

ఇక ఆగేనేం?

అంచుల దాకా కంచం నాకేసి, హస్త ప్రక్షాళన కావించాడు. ఆర్చుకు పోయే నోట్లో బియ్యం నింపి, సాఫుగా నములుతూ, వేషధారణ మొదలుపెట్టాడు. ఈ రోజుకి ఎలాగైనా గంటలో ముగించాలి టాయ్‌లెట్!

ఏమిటీ? అద్దంలో కనపడేది అమితాభా? తనా?

'హట్ జావ్! బకోయిత్! మొహబ్బత్!' గొణుక్కున్నాడు. అంటే, ఏమిటో?

తొందరగా హిందీ నేర్చుకోవాలి.

హేమమాలినిని తలుచుకుంటూ ఓ అరగంట పాటు దువ్వెనతో సాధన చేసి రొప్పాడు. 'యే క్యాహై?. . .' సేహ అడుగున ఉన్న కొబ్బరినూనెతో నీళ్ళు కలిపి ఎంత మర్దించినా వెధవ జుట్టు అణగందే!

చిన్న పిగిలిన పాంటుకు చకచకా సూది ఎక్కించి ఎంతో. ఓర్పుతో, నేర్పుతో లాఘవంగా తొడగసాగాడు.

"దిల్ తేరా దీవానాహై సనమ్!"

హమ్మయ్య! ఈ రోజు కీ యజ్ఞం పూర్తి అయింది.

"ఐ లౌ యూ! కిస్. . . కిస్. . ."

వాళ్ళ నాన్న పాత పంచ పెట్టి చెప్పుల్ని ఎంచక్కా పాలిష్ చేశాడు. తొందర్లో పాయింటెడ్ బూట్ కొనక పోతే లైఫ్ దండగ!

జేబులో చెయ్యి పెట్టి ఐదు రూపాయల నోటు తడుముకుంటూ, వీధిలో అడుగు పెట్టాడు వెంకటేశ్వర్లు సారీ, వెంకటేష్!

మజ్జిగకూడా లేకపోవటం వల్ల కడుపు కొరివికారం ధాటికి కొరివి దెయ్యంలా మండుతూంది. రెణ్ణెల్ల నుండీ చెంబు ఇస్త్రీతో సతమతమయ్యే బెల్‌బాటమ్ పాంటు ముడతలు పడుతూంది.

కాని, కేరే జాట్!

సినీ పోస్టర్లని శల్య పరీక్ష చేసి కంఠస్థం చేస్తూ, ఆడాళ్ళ వేపు పిచ్చి చూపుల తూపులు విసురుతూ, టైట్ పాంట్ల వాళ్ళను బి.సి. లోనికి నెట్టేస్తూ, బఫ్ క్రాపుల్నీ, ఈల నడకల్నీ, పీల నడకల్నీ చోరోపల పొగిడేస్తూ ఎలాగో సెంటర్ చేరాడు.

అక్కడ అతని కోసం మిత్రబృందం ఆత్రంగా చూస్తూ ఉంది.

"హల్లో మిస్టర్ వాక!" అంటూ ఆహ్వానించాడు హిందీ సినిమాలు ఎడతెగక చూసే గాజు గడియారం అనిల్. అతని వాచీ ఆడాళ్ళ గాజుల్లా వేలాడుతూ ఉంటుంది. అతను వెంకటేష్‌లో జానీవాక (ర్) ను చూస్తాడు.

"నో,నో. హి ఈజ్ మిస్టర్ జెర్రి!" అన్నాడు వెర్రి చూపులతో ఆడాళ్ళను బెదరగొట్టే ఆంటోని. అతను జెర్రీ లూయిస్ అంటే పడి చస్తాడంటే.

"నోరుమ్మయ్యండోయ్! మనాడు నల్ల రామ్మూర్తి!" అన్నాడు నాగేశ్వరరావు. తెలుగు సినిమాలను అభిమానించేది ఇతనొక్కడే. ఇతన్ని నగేష్ అని కూడా అంటారు.

"రావోయ్, ఎనకటేమూ!" అన్నాడు అతి వాస్తవిక వాది అంకమ్మ.

గాంగు కూలీల్లా ఓ చోట చేరి వాగుతున్న వాళ్ళను చూస్తే ముచ్చటేసింది వెంకటేష్‌కి.

"ఏరా, అనిల్! డింపుల్ పెళ్ళికి వెళ్ళలేదా?" అన్నాడు వెంకటేష్. అనిల్ జేబులో క్యాష్‌నిల్ అని అతని అభిప్రాయం.

తరవాత వాళ్ళ చర్చ రాజేష్ ఖన్నా అదృష్టం దగ్గిర నించి, టున్‌టున్ సౌందర్యం దాకా సాగింది. కాని, ఎన్నో సమస్యలు అపరిష్కృతంగా ఉండి పోయాయి. ఎలిజబెత్ టేలర్ పెళ్ళిళ్ళ సంఖ్య ఎంతో తేలలేదు. సీన్ కానరీ ఎంత ఎత్తో అంతు పట్టలేదు. అశోక్‌కుమార్ ఫస్ట్ పిక్చర్ ఏది అనే విషయంలో అభిప్రాయ భేదాలు వచ్చాయి. అయితే, ఎల్విస్ ప్రెస్లీ లాగా మనవాళ్ళు పాడలేరనీ, అవా గార్డనర్ ముసల్ది అయిందనీ, హిందీ పిక్చర్ల ముందు మన పిక్చర్లెందుకూ పనికి రావనీ, మన సినీ మ్యూజిక్ అంతా హిందీ, ఇంగ్లీషు సినిమాలకు కాపీ అనీ అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు.

"జెర్రీ! నీ పాంటుకు ముడత లెన్నిరా?" అంటూ టాపిక్ మార్చాడు ఆంటోని, పీటుగా ఉన్న తన వాలో పాంటు చూసుకుంటూ.


"ఎన్ని అయితే నేం పాత పాంటుకి? నాకు బాలేదు తీసేసిన పాంటు ఇవ్వటానికి" అన్నాడు వెంకటేష్.

అందరితోబాటు నవ్వక తప్పింది కాదు ఆంటోనీకి.

ఇలా ఒకరి వేషాన్ని ఒకరు పొగడ్తలతో పరాభవిస్తూ సాగుతున్నారు కాస్సేపు.

"రేయ్! అడుగో. అది చూడు. అంతా డీ-ఫుల్ ఉన్నట్టే ఉంది" అన్నాడు అనిల్.

"దాని ముఖం! అంత పొడు గెక్కడిది రా!" అన్నాడు వెంకటేష్.



"ఆ పక్క మందే.. అదేమిట్రా. లంగమూత్తూలాడుంది!" అన్నాడు అంకమ్మ.

"నీకు సరిపోతుంది" అన్నాడు నాగేశ్వరరావు ఉరఫ్ నగేష్.

అందరూ బిగ్గరగా నవ్వటంతో వాళ్ళు వీళ్ళ వైపు చూశారు. అనిల్ బఫ్ క్రాప్ చూసి నవ్వూ, ఆంటోనీ మిడి గెడ్డం చూసి భయమూ, వెంకటేశ్ పాంటు ముడతలు చూసి జాలీ, నగేష్ పళ్ళ గార చూసి డోకూ, అంకమ్మ రంగు చూసి అసహ్యమూ కలిగి తలలు వంచుకుని చకచకా వెళ్ళిపోయారు.

భారత భాగ్యవిధాతలు ఇలా రన్నింగ్ కామెంటరీతో వినోదించి, వినోదించి, పరవశించి పడి పడి నవ్వుతున్నారు. ఆ క్షణాన వాళ్ళకి ఆర్థిక ప్రణాళికలు కాని, ఆర్కిమెడీస్ సూత్రాలు కాని, లా ఆఫ్ డిమినిషింగ్ యుటిలిటీ కాని, సింధు నాగరికత కాని, సరళాదేశ సంధి కాని, పెర్ఫెక్ట్ కంటిన్యుయెస్ టెన్స్ కాని మరేమి కాని గుర్తు లేవు.

"రండిరా! మెట్రో కేఫ్‌లో కూచుని రికార్డులు విందాం" అంటూ దారి తీశాడు వెంకటేశ్.

మూకుమ్మడిగా పోయి పడ్డారు హోటల్లో.

హిందీ రికార్డులు వెయ్యమని చెప్పాడు అనిల్.

'బండ పట్నంలో కాలిబండ' రికార్డు వెయ్యమని జంకుతూ అన్నాడు నాగేశ్వర్రావు.

"వీడో బండ" అన్నాడు వెంకటేశ్.

"ఏ అడవిలో పట్టుకొచ్చార్రా, వీన్ని?" ఆంటోనీ ఉవాచ.

"నీ బండబడ! లేపోతే అలా పోయి పోడి చెప్పించుకో రాదురా!" సలహా ఇచ్చాడు అనిల్.

కిమ్మనలేదు నాగేశ్వర్రావు.

హిందీ పాటలు వేస్తూంటే పారవశ్యంతో గుడ్లు తేలేసి వింటున్నారంతా.

"బర్మన్, నయ్యర్, నౌషద్, రఫీ, లత, మన్నా డే" అని కలవరిస్తున్నారు. "ఏం కొట్టాడ్రా!" అని మెచ్చుకుంటున్నారు. ఎవరు కొట్టక ముందే ఇలా గుడ్లు తేలేసి తూగుతున్న వీళ్ళను వింతగా చూస్తున్నాడొక పెద్దమనిషి. హిందీ భాషామృతాన్ని ఇంత చక్కగా గ్రోలే వీళ్ళు 'హిందీ డౌన్ డౌన్' అంటూ కాలేజీ ఎందుకు ఎగ్గొట్టారో అర్థం కావటం లేదు ఓ మూల కూచుని ఉన్న పరిశీలకుడికి. నలుగురూ అలా తమ వైపు చూస్తూంటే పారవశ్యం ఎక్కువవుతూంది గాంగ్‌కి. లేచి ట్విస్ట్ చేద్దామన్నంత ఆవేశం వచ్చింది ఆంటోనీకి. కాని, పొద్దున పంపు నీళ్ళు రాలేదని ఇంట్లో అన్నం పెట్టక పోవటం వల్ల మహా నీరసంగా ఉంది. పైగా నేటి రోజు కాఫీ ఇప్పించే వంతు అతనిది. జేబులో పైసా లేదు. ఉన్న దంతా రాత్రి సెకండ్ షో బాల్కనీ టికెట్‌కొనటానికే అయిపోయింది. లేకపోతే లోన్‌కు దగ్గర్లో కూచునే దెలా మరి?

"బోయ్!" నైసుగా కేకేశాడు వెంకటేశ్.

ఆంటోనీ ప్రాణాలు లేచి వచ్చాయి.

"అయిదు మినప.." ఐదు తాజ్ మహాళ్ళు కట్టమన్నంత దర్జాగా ఆర్డరిచ్చాడు వెంకటేశ్.

"ఏహోయ్! ఎక్కడ కొట్టేశావు?" అన్నాడు అంకమ్మ కళ్ళు ఎగరేస్తూ.

"తపేలా అమ్మి తేలేదులే" అన్నాడు వెంకటేశ్, అంకమ్మ సాహసాన్ని గుర్తు చేస్తూ.

"మరి పళ్ళెం అమ్మి తెచ్చావా?" అన్నాడు అనిల్.

ఆ మన్నితమైన విట్టుతో తరాల నాటి కసి తీరినంత బ్రహ్మానందంతో పగలబడి నవ్వుతూ పక్కనే ఉన్న సాసరు పగలేశారు. మినపట్లును భక్షించటం ప్రారంభించారు.

పేగులు ఆవురావురు మంటున్నప్పటికీ బన్నూ కేకూ తిన్నంత నేర్పుగా, స్టైల్‌గా తినసాగాడు ఆంటోనీ. అతనికి ఇంగ్లీషు సిన్మాల్లో ఎంతో నేవళంగా తిన్న దృశ్యం గుర్తుకు వస్తూంది.

"త్రీ బై ఫైవ్ కాఫీ!" అన్నాడు వెంకటేశ్.

బడ్జెట్ ఐదు రూపాయలకు పరి పెట్టటం అవసరం మరి. దేశం లోని అత్యవసరపరిస్థితి అతనికి తెలియకపోలేదు. వారెడసి ఉడుకుమూరు పిల్లని అమ్మాయి ప్రాయంగా దప్పించారు; చెప్పించారు.

ఐదు రూపాయల నోటును, బిల్లును కౌంటర్ మీదికి విలాసంగా విసిరేశాడు


లక్షలాది ప్రజలు ఏరి కోరి ధరించుచున్నవి




BISON

బైసన్

• బనియన్స్ • అండర్ వేర్స్

• బ్రా • పెట్టికోట్ • జట్టీస్

BISON KNITTING COMPANY TIRUPUR-638604.

మానేజింగ్ పార్ట్నర్ : మిల్లర్ టి. రామస్వామి

వెంకటేశ్. బయటికి వచ్చిన తరవాత—"మరి సిగారెట్" అన్నాడు నగేష్ వెకిలిగా నవ్వుతూ.

భార్యా పుత్రుల్ని అమ్ముకున్న హరిశ్చంద్రుడిలా దిగాలు పడి నించున్నాడు వెంకటేశ్.

"ఉన్నది తా ఊడిచి ముగ్గేశాడు. ఇంకా వాడి దగ్గరేముంది నా బొంద!" అంటూ నోట్‌బుక్ కొనుక్కోవాలని చెప్పి ఇంట్లో సంగ్రహించిన మొత్తాన్ని వెచ్చించి ఓ బర్కిలీ పాకెట్ కొని అందరికీ పంచాడు అంకమ్మ.

కులాసాగా నించుని, పొగ రింగులు వదలడం తాపీగా అభ్యసిస్తున్నారు, సినీ పత్రికల సారాంశాన్ని నెమరేస్తున్నారు; అడపాదడపా రాజకీయపరిస్థితిపై కూడా ఖండన మండనలు చేస్తున్నారు; ఆవేశంలో అరుస్తున్నారు; ఖుషీగా నవ్వుతున్నారు.

పాకెట్ ఖాళీ అయింది.

"రేయ్! రేపు లీలాలో స్పైశ్వర్స్! జీన్‌మార్చి నున్నాడు" అని ప్రకటించాడు ఆంటోనీ.

"ఇంకేం? రేపు సెకండ్ షోకి రెడీ!" అన్నాడు అనిల్. అందరూ ఉత్సాహంగా తల ఊపారు.

"దొట్స్!" అంటూ వీడ్కోలు పుచ్చుకున్నారా నాటికి. రేపంతా సినీ ధనం సంపాదించే పని! సంపాదనాపరులు గదా మరి!

వెంకటేశ్ ఉత్సాహంగా నడుస్తున్నాడు. భలే ఆనందంగా ఉంది అతనికి. ఫ్రెండ్స్‌కు టిఫిన్, కాఫీ ఇప్పించటం ప్లాన్!

ఈల వేస్తున్నాడు, హిందీ ట్యూన్ అందుకుని ఆలపిస్తున్నాడు.

ఇల్లు చేరాడు.

ఒళ్ళు కంపర మెత్తింది.

ఛీ! వెధవ పూరిల్లు!

హిందీ హీరో బంగళా గుర్తువస్తోంది.

తమ్ముడు ఏడుస్తున్నాడు. చెల్లెలు మూలుగుతూంది. అమ్మ బిగ్గరగా అరుస్తోంది.

"ఏమిటే గోల?" విసుక్కున్నాడు వెంకటేశ్.

"అది కాదురా, వెంకటేసుబాబూ! ఆ అయిదు రూపాయలూ నువ్వు కాని తీశావా?"

"ఏ అయిదు రూపాయలు?" వెంకటేశ్ దృఢంగా అన్నాడు. అతను ధైర్యవంతుడు.

"అవేరా, చూరోల్లో పెట్టినవి?"

"ఏమో! నా కేం తెలుసు?"



"మరెవరు తీసినట్టు? చిన్నాణ్ణి ఎంత తన్నినా నేను తియ్య లేదంటున్నాడు. మీ అయ్యేమో తాగొచ్చి పడుకున్నాడు. బియ్యానికని దాచిపెట్టిన డబ్బు ఎవరు తీసినట్టు? ఈ పూట బువ్వకి లేదు. ఈ సంసారం నేను చెయ్యలేను—దేవుడో!" అంటూ ఏడవసాగింది ఆమె.

"అమ్మా, ఆకలే!" అంటూ, మూలుగుతూంది చెల్లెలు.

ఇవేం పట్టవు వెంకటేశ్‌కి.

అతనీ రోజు స్నేహితులతో హాయిగా, తృప్తిగా గడిపేశాడు.

అది చాలు అతనికి.

మంచంమీద పడుకుని కమ్మగా నిద్రించాడు పరమ స్నేహశీలి. ✻